క్లుప్తంగా

వెల్లటూరు, పెదపులివర్రులో వైద్య శిబిరాలు




వెల్లటూరు(భట్టిప్రోలు): స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీ, పెదపులివర్రు సబ్ సెంటర్‌ల పరిధిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నట్లయితే కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగుంటుందని ఆమె పేర్కొన్నారు. ఎంపీపీ లలిత కుమారి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు కలసి గర్భిణులకు సీమంతాలు జరిపారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు జి.అబ్రహం లింకన్ 16 రకాల సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. మాతాశిశు సేవలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, టీబీ పరీక్షలు, మధుమేహం, ఆయుష్ వైద్య సేవలు, సికిల్ సెల్ వంటి వ్యాధులకు అవసరమైన వారికి సేవలు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వై.శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కె.ఆశాజ్యోతి, ఏఎన్‌ఎంలు వి.లీలారాణి, ఎస్.ఉషాదేవి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

చుండూరు(వేమూరు): పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు టీకాలు వేయడం జరుగుతుందని వలివేరు పశువైద్యాధికారి అపర్ణ తెలిపారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాపించడం జరుగుతుందని ఆమె అన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పశువులకు ముందస్తు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం ఎంపీడీవోగా శేఖర్



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం ఎంపీడీవోగా సీహెచ్ శేఖర్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈవోపీఆర్డీ ఎలీషాబాబు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. సీహెచ్ శేఖర్ వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఎంపీడీవోగా పదోన్నతి పొంది పిట్టలవానిపాలెం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ మండల పరిధిలోని అధికారులందరినీ సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే పీ4 సర్వే

ఎంపీడీవో మహబూబ్ సుభాని



చెరుకుపల్లి: ప్రజల స్థితిగతులను తెలుసుకుని వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకే పీ4 సర్వే నిర్వహించబడుతుందని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని సచివాలయ సిబ్బందికి రెండు విడతలుగా ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ పేదరికం లేని సమాజం కోసం బంగారు కుటుంబాలను గుర్తించి మార్గదర్శకులకు అనుసంధానం చేయాలని అందుకు సచివాలయ, రెవెన్యూ సిబ్బంది సంధానకర్తలుగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా బంగారు కుటుంబాలకు అవసరమైన ఆధార్ కార్డులు, రేషన్ కార్డులుతో పాటు వారి జీవనోపాధి మెరుగుపరచటానికి కావల్సిన ఆర్థిక వనరులు లభించే విధంగా చూడాలని ఎంపీడీవో వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లుగా ఆళ్ళవారిపాలెం కార్యదర్శి గోపాలకృష్ణ, తూర్పుపాలెం కార్యదర్శి సాయికృష్ణ వ్యవహరించారు.

వరహాపురం.. అంధకారం

- గ్రామంలో వీధి లైట్లు వెలగక ఇబ్బందులు
- వర్షాలకు రోడ్లు, ఖాళీ స్థలాల్లో నిలిచిన నీరు
- చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

వేమూరు: వీధి లైట్లు వెలగక, రోడ్లపై నిలిచిన వర్షపు నీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయంలో చాలా ఇబ్బందిగా ఉందని గ్రామం పూర్తిగా అంధకారంలో ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. కొన్ని నెలలుగా అక్కడక్కడ వీధి లైట్లు వెలుగుతున్నా.. గత మూడు రోజుల నుంచి గ్రామంలో ఎక్కడా ఒక్క వీధి దీపం కూడా వెలగకపోవడంతో ప్రజలు నడవడానికి నానా అవస్థలు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా ప్రతి రోజు వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లు, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి.. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో రోడ్ల పైకి రావాలంటేనే నరకంగా మారిందని వాపోతున్నారు. రోడ్లపై నడవాలంటేనే చీకట్లో ఏ పురుగు పుట్ర ఉంటుందోనని భయపడుతున్న పరిస్థితి. పంచాయతీ అధికారులు గ్రామంలో వీధి లైట్ల సమస్య గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

దోమల బెడదతో ఇబ్బందులు

ఒకవైపు గ్రామంలో వీధి లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల దోమల బెడద ఎక్కువ అయి ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు దోమలు మందు పిచికారీ చేయడం లేదని అంటున్నారు. గ్రామంలో వీధుల్లో బ్లీచింగ్ పిచికారీ చేసి కొన్ని నెలలు అయిందని వారు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు గ్రామంలో పారిశుద్ధ్యం గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు లేక.. పారిశుద్ధ్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి గ్రామంలో వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వరహాపురంలో వెలగని వీధి దీపాలు



వరహాపురంలో ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు

చర్యలు తీసుకుంటాం

గ్రామంలో వీధి దీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గ్రామంలో పారిశుద్ధ్య పనులు కూడా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– స్టాలిన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, వరహాపురం, వేమూరు మండలం

వరిలో ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏవో రమేష్‌బాబు

నగరం: రైతులు వ్యవసాయ నిపుణుల సూచనల మేరకే ఎరువులను వినియోగించాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని బొర మాదిగపల్లిలో మంగళవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో వరి పంటలో సమర్థవంతమైన ఎరువుల వినియోగవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు జీవన ఎరువులైన పాస్ఫో బ్యాక్టీరియా, ఇనాక్యులెంట్ (పీఎస్‌బీ, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా(కేఆర్‌బీ)), ద్రవ రూప జీవన ఎరువులను వినియోగించాలన్నారు. ఈ రెండు రకాల ఎరువులను పశువుల, సేంద్రియ ఎరువులతో ఒక లీటర్ కలిపి రెండు ఎకరాల పొలంలో నాటిన వారం రోజులలోపు చల్లుకోవాలన్నారు. కేఆర్‌బీ భూమిలో లభ్యం కాని పొటాషియంను.. పీఎస్‌బీ భూమిలో లభ్యం కాని భాస్వరంను మొక్కలకు అందించి ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. అదేవిధంగా నానో యూరియా, డీఏపీపై అవగాహన కల్పించారు. ఒక ఎకరానికి 500మి.లీ. నానో యూరియా సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసం జెడ్పీ హైస్కూల్ ఏర్పాటు చేయాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల కేంద్రంలో పేద విద్యార్థులు చదువుకునేందుకు జిల్లా పరిషత్ హైస్కూల్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ కోరారు. మంగళవారం భట్టిప్రోలు విచ్చేసిన సందర్భంగా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని, స్కానింగ్, ఎక్సరే ఏర్పాటు చేయాలని, భట్టిప్రోలు నుంచి చావలి మీదగా తెనాలి వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి ఆక్రమణలను తొలగించి వెడల్పు చేయాలని, పీఎంఏవై, ఎన్టీఆర్ (జగనన్న) కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఐలవరంలో హిందూ శ్మశానవాటిక రహదారి ఆక్రమణకు గురయిందని సర్వే నిర్వహించాలని, భట్టిప్రోలు, అద్దేపల్లి, అక్కివారిపాలెం, పెసర్లంక, పెదపులివర్రు, పెదపాలెం, మధ్యగూడెం పలు గ్రామాల్లో శ్మశాన స్థలాలు లేక ఎస్సీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యన్నారాయణ, సుధాకర్, నాగరాజు, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగజ్జనని.. రక్షమాం

రెండో రోజు పలు చోట్ల గాయత్రీదేవిగా దర్శనం

కర్లపాలెం: దేవి శరన్నవరాత్రులలో రెండవ రోజు కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాయత్రీ అలంకారంలో అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. కర్లపాలెం కాళికాంబ సమేత వీరభద్రస్వామి ఆలయం, పెద్దింటమ్మ ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాలలో భాగంగా పెద్దింటమ్మ ఆలయంలో సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ హనుమంతరావు దంత వైద్య పరీక్షలు చేశారు. పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసియున్న రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దుర్గమ్మ లలితాత్రిపుర సుందరి అలంకారంలో పూజలందుకున్నారు. ఖాజీపాలెం, మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం, సంగుపాలెం గ్రామాలలో అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

ప్రత్యేక అలంకారాలలో అమ్మవార్లు

భట్టిప్రోలు: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం మండలంలోని గ్రామాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

కొల్లూరులో...

కొల్లూరు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు మండలంలో వైభవంగా జరుగుతున్నాయి. కొల్లూరు పార్వతీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తీర్థప్రసాద వినియోగం చేశారు. రాత్రి ప్రవచనకర్త మలుకుట్ల విశ్వనాథ శర్మ పురాణ ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. మండలంలోని కోటిపల్లి సోమశేఖరాలయంలో అమ్మవారు గాయత్రీదేవి ఆలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

చుండూరు మండలంలో...

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో కనకదుర్గ సమేత రామచౌడేశ్వరస్వామి దేవాలయంలో దేవి నవరాత్రులలో భాగంగా మంగళవారం చండీ హోమం నిర్వహించారు. అమ్మవారికి పాలాభిషేకం, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. పూర్ణాహుతి, ప్రసాద వితరణ నిర్వహించారు.

నగరంలో...

నగరం: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను మండలంలోని పలు గ్రామాలలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా అమ్మవారు మంగళవారం గాయత్రీ దేవిగా భక్తులకు దర్శమిచ్చారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం, ధూళిపూడిలోని కనకదుర్గ ఆలయం, సంతబజార్‌లో ఏర్పాటు చేసిన కనకదుర్గ విగ్రహాలకు విశేష పూజలు చేశారు. మండలంలోని కొలగానివారిపాలెం, మీసాలవారిపాలెం గ్రామాలలో ఏర్పాటు చేసిన కనకదుర్గ ప్రతిమలకు ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీరథ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాపట్ల మండలంలో...

బాపట్లటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో కన్నుల పండుగగా జరుగుతున్నాయి. మండలంలోని రామానగర్‌లో వెంచేసియున్న ప్రసన్నదుర్గాభవానీ దేవాలయంలో మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని రామానగర్, ముత్తాయపాలెం గ్రామాల్లో భవానీ మాలలు ధరించిన దీక్షాపరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా కుంకుమ పూజలు

చెరుకుపల్లి: మండంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు రెండవ రోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడియి. గుళ్ళపల్లిలోని ఆనందీశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, చెరుకుపల్లి బాలకోటేశ్వరస్వామి, కావూరు రామలింగేశ్వరస్వామి దేవస్థానాల్లో గాయత్రీ దేవిగా అమ్మవార్లను అలంకరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని కుంకుమ పూజలు నిర్వహించారు.

వేమూరులో...

చావలి(వేమూరు): వేమూరు మండలంలోని చావలి వాలేశ్వరస్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని సర్వమంగళ పార్వతీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో...



అల్లూరు నరసింహస్వామి ఆలయంలో...



భట్టిప్రోలు మండలం ఐలవరంలో...



భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో...




కొలగానివారి పాలెంలో...



కోటిపల్లి సోమశేఖరాలయంలో...



నగరం సంతబజార్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమ



మోదుకూరు గ్రామంలో...



కావూరు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో...



చావలి వాలేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు

పంచాయతీలలో ఆదాయ వనరులను సమకూర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: గ్రామ పంచాయతీలలో సొంత ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో గ్రామ పంచాయతీల పరిధిలో కాంప్లెక్స్‌లు నిర్మించుకుని అద్దెకు ఇవ్వటం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చునని చెప్పారు. నిర్దిష్టమైన కొలతలతో ఇంటి పన్నులు వసూలు చేయాలని చెప్పారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా ఉన్న వారికి అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రజని, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

బాపట్ల ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ హుస్సేన్

చింతమోటు(భట్టిప్రోలు): రసాయనిక ఎరువులను తగ్గించి రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని బాపట్ల ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ కేంద్రంను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతం వంటి కషాయాలను వినియోగించాలని కోరారు. విషతుల్యం కాని ఆహార పదార్థాలను పండించేందుకు రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంటీ ప్రకాష్, ఎంఎంటీలు రాధిక, సుధారాణి, ఫార్మర్ సైంటిస్టులు వెంకటేశ్వరనాయక్, రాజ్ కుమార్, ఆర్‌సీ శ్రీలక్ష్మి, జాన్‌శ్రీ, ఐసీఆర్పీలు ప్రసన్న, సుశీల, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



మతి స్థిమితం లేని మహిళను కుటుంబానికి అప్పగింత

కొల్లూరు: రాత్రి సమయంలో ఒంటరిగా సంచరిస్తున్న మతి స్థిమితం లేని మహిళను కొల్లూరు పోలీసులు సురక్షితంగా ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటనలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీసులను అభినందించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఈపూరులో సోమవారం రాత్రి ఓ మహిళ ఒంటరిగా తిరుగుతుండటంతో స్థానికులు కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ జానకి అమరవర్ధన్ సిబ్బందితో కలసి వెళ్లి ఆమెను కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆమె మానసిక సమస్యతో బాధపడుతున్నట్లు గమనించిన ఎస్ఐ ఆమె సమాచారాన్ని తెలుసుకొని అచ్చంపేట ప్రాంతానికి చెందిన అమీనాగా నిర్ధారణ అవడంతో జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్పీ ఆదేశాలతో సాంకేతిక పరిజ్ఞానంతో ఆమె కుటుంబ వివరాలు సేకరించి వారికి సమాచారం అందించారు. 10 రోజుల క్రితం ఆమెను వైద్యశాలలో చికిత్సకు గుంటూరు తీసుకురాగా తప్పించుకొని వచ్చినట్లు ఆమె భర్త వెల్లడించాడు. మహిళ భద్రత దృష్ట్యా సోమవారం రాత్రి తెనాలిలోని జేఎంజే సదరన్ హోమ్‌లో ఆమెను ఉంచి, మంగళవారం ఆమె భర్త సిలార్‌కు సురక్షితంగా అప్పగించారు.

సంజీవ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వేమూరు: చూడచక్కని హెరిటేజ్ పాలు అని పోస్ట్ పెట్టిన ఉస్థలి సంజీవ రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్టు బాపట్ల జిల్లా వేమూరు రూరల్ సీఐ అంజనేయులు వెల్లడించారు. అనంతపురం జిల్లా బెలిగుప్ప మండలం, నక్కలపల్లి గ్రామానికి చెందిన ఉస్థలి సంజీవరెడ్డి చూడచక్కని హెరిటేజ్ పాలు అని ప్రొఫైల్ ఐడీతో ఫేస్‌బుక్‌లో నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, నారా బ్రాహ్మణి, నారా భువనేశ్వరి, పవన్ కళ్యాణ్‌పై అసభ్యకరమైన పోస్టు పెట్టి వారిని కించపరచాలనే ఉద్దేశంతో వారి ఫోటోలు మార్ఫింగ్ చేసి అభ్యంతరకర విధంగా ప్రవర్తించినందుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేమూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అతనిపై క్రైమ్ నంబరు 144-2024, యు-యస్ 192, 196, 336(4), 353(2), 79 బీఎన్ఎస్ అండ్ ఎస్ఈసీ 67 ఆఫ్, ఐటీ యాక్ట్ 2000-2008 నమోదు చేసి దర్యాప్తు జరిపి మంగళవారం అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు.

వృత్తి విద్య కోర్సుల ద్వారా ఉపాధి



కర్లపాలెం: వృత్తి విద్య కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని అగ్రికల్చర్ ఒకేషనల్ ట్రైనర్ ఎం.సుధాకర్, ఆటోమోటివ్ ఒకేషనల్ ట్రైనర్ సాయిబాబు తెలిపారు. యాజలి జెడ్పీ హైస్కూల్లో 9, 10, ఇంటర్ తరగతులలో వృత్తి విద్య కోర్సుల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మంగళవారం ద్విచక్ర వాహనాల రిపేరు, నర్సరీలలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. నర్సరీ యజమానులు శ్రీనివాస్, వెంకటరామ్‌లు తమ నర్సరీలో ఎలాంటి మొక్కలు పెంచుతున్నదీ వాటికి వేస్తున్న సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ట్రైనర్స్ సుధాకర్, సాయిబాబు మాట్లాడుతూ దసరా సెలవులలో విద్యార్థులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయం, ఆటోమొబైల్ రంగాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.